క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠ పూజలు


హోమం పూజలో పాల్గొన్న స్థానికులు

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ జగదాంబగుంపు గ్రామంలో నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవ పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి నాభిశిల ప్రతిష్ఠించేందుకు సాయంత్రం గ్రామస్తులంతా వేదమంత్రోచ్ఛరణల మధ్య హోమం పూజలో పాల్గొన్నారు. తెల్లవారుజామున గ్రామం చుట్టూ బలి చల్లడంతోపాటు గురువారం బోనాల చెల్లింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

ప్రజాభవన్‌కు తరలిరండి..


మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: కాంట్రాక్ట్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి వ్యక్తిగత దరఖాస్తులతో ప్రజాభవన్ ఆందోళనకు తరలిరావాలని టీయూసీఐ జిల్లా నాయకుడు యాకుబ్‌షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఇల్లెందులోని టీయూసీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. 12 ఏళ్లగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచలేదన్నారు. సోలార్‌లో పని చేస్తున్న కార్మికులకు 29 రోజులుగా పనులు లేవని వాపోయారు. సమస్యల పరిష్కారానికి 22న చలో హైదరాబాద్ ప్రజాభవన్ ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు గురునాథం, రామకృష్ణ, శ్యామ్, హమీద్ చందర్, దళ్‌సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు


అమరవీరుల స్తూపం వద్ద నాయకులు

ఇల్లెందు: మేడ్చెల్ జిల్లా మల్కాజిగిరిలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభల ప్రతినిధులుగా ఇల్లెందుకు చెందిన తొమ్మిది మంది డెలిగేట్స్ బుధవారం తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సీపీఐ ఇల్లెందు ఏరియాకు చెందిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు మిర్యాల రంగయ్య, కె.సారయ్య, డి.శంకర్, బంధం నాగయ్య, పట్టణ, మండల కార్యదర్శులు బాస శ్రీనివాస్, బి.సత్యనారాయణ, ఎండీ నజీర్, గుగులోతు రాంచందర్, బొల్లి కొమరయ్య, కమటం చంద్రకళ తదితరులు ఉన్నారు.

నాగేశ్వరరావు మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జూలూరుపాడు: రామచంద్రాపురం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు కొడెం నాగేశ్వరరావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన భౌతికాయాన్ని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, నాయకులు సందర్శించి, పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో గడిదేశి కనకరత్నం, బానోత్ మధు, పద్దం సుగుణ, రాములు, కొడెం సరిత, బక్కులు, చంటి పాల్గొన్నారు.

వర్షంలోనూ సాగుతున్న వరినాట్లు


మామిడిగూడెంలో నాట్లు వేస్తున్న కూలీలు

ఇల్లెందురూరల్: వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షం వ్యవసాయ పనులకు ముందుకు సాగకుండా అవరోధంగా మారింది. బుధవారం కొంత తెరిపివ్వడంతో మెరక ప్రాంతాలలో రైతులు వరినాట్లు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. వాగుల వెంట మెరకగా ఉన్నచోట కొట్టుకుపోయిన వరినాట్ల స్థానంలోనూ మరోసారి నాట్లు వేస్తున్నారు. బుధవారం కూడా చెదురుమదురుగా వర్షం కురవడంతో వ్యవసాయ కూలీలు కవర్లను వినియోగించి వరినాట్లు కొనసాగించారు.

దెబ్బతిన్న పంటలు మేట వేసిన పొలాలు
రైతులకు తీవ్ర నష్టం

జూలూరుపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జూలూరుపాడు మండలంలో ప్రధానంగా పత్తి పంట తీవ్రంగా దెబ్బతినగా, వరి, మిరప పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నల్లరేగడి భూముల్లోని పత్తి నీరు చిచ్చు బట్టి ఎర్రబారిపోవడం, వేళ్లు కుళ్లి పత్తి మొక్కలు చనిపోతున్నాయి. కొత్తూరు శనగ చెరువు అలుగు పోయడం, తుమ్మలవాగుకు వరద నీరు పోటెత్తడంతో పరివాహక ప్రాంతంలోని పత్తి పంట ముంపునకు గురికావడంతోపాటు మొక్కలు కొట్టుకపోయి సుమారు 300 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. అదేవిధంగా పెద్దవాగు, ఎదళ్లవాగు, అలుగువాగు, బండలరేవు వాగు, వంకలు పరివాహక ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాలకు పైగా పత్తి పంట కొట్టుకపోయింది. కొద్దిపాటి పంట మిగిలినా పత్తి మొక్కలకు ఉన్న పూత, పిందె రాలిపోతోంది. మండలంలో దెబ్బతిన్న పత్తి పంటకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ వానాకాలం జూలూరుపాడు మండల వ్యాప్తంగా సుమారు 18,000 ఎకరాల్లో పత్తి సాగయింది. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురిసి విత్తనాలు విత్తిన తరువాత వరుణదేవుడు ముఖం చాటేయడంతో మొలకలు


పడమటనర్సాపురంలో కొట్టుకపోయిన పత్తి పంట

రాకపోవడంతో రెండు, మూడుసార్లు విత్తనాలు విత్తాల్సి రావడంతో రైతులపై అదనపు భారం పడింది. ఆగస్టు మొదటి వారం వరకు ఎండలు దంచికొట్టడంతో వేసవికాలాన్ని తలపించింది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో జోరువానలు కురవడంతో రైతులు సంతోషపడ్డారు. వారంరోజులుగా ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షాలకు పంటలు ఆగమాగం కావడంతో రైతులు కంటనీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- సీజన్ ప్రారంభంలో అనావృష్టి. ఇప్పుడు అతివృష్టి
- ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలంలో అతివృష్టి, అనావృష్టి వెంటవెంటనే చోటుచేసుకోవడం రైతులను కలచివేస్తోంది. సీజన్ ప్రారంభంలో పత్తి, మొక్కజొన్న విత్తనాలు విత్తుకున్న రైతులు వర్షాభావంతో అవి మొలకెత్తకపోవడంతో రెండోసారి విత్తనాలు విత్తుకున్నారు. అవికాస్తా ఏపుగా పెరుగుతున్న దశలో వారంరోజులుగా కురిసిన భారీ వర్షాలు పంటలను ఛిద్రం చేశాయి. ఒకే సీజన్‌లో రెండు సార్లు పెట్టుబడి పెట్టినా పంటల పరిస్థితి దయనీయంగా మారడంతో రైతులు కన్నీళ్ల పర్యాంతమవుతున్నారు. ఇక వరినాట్ల ప్రారంభం నుంచే వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరి రైతులు ఆనందంగా నాట్లు ప్రారంభించారు. భారీ వర్షాలతో వరినాట్లు కూడా రోజుల తరబడి నీటిలో మునిగి ఉండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా వాగులలో వరద భారీగా చేరడంతో సమీపంలోని పంట చేలన్నీ నీటమునిగాయి. మొండితోగు, రేపల్లెవాడ, కట్టుగూడెం తదితర గ్రామాలలో బుగ్గవాగు ఉధృతికి పత్తి, మొక్కజొన్న చేలల్లోకి ఇసుక మేటలు


మొండితోగులో పత్తి చేనులో ఇసుక మేట

వేయడంతో ఇప్పుడిప్పుడే ఎదుగుతన్న పత్తి, మొక్కజొన్న మొక్కలు పూడిపోయాయి. చెరువులు ఉధృతంగా మత్తడి పోయడంతో ఇటీవల వరినాట్లు వేసిన పొలాలు నీట మునిగాయి. సీతానగరం, పోచారంతండా, కొమరారం, బోయితండా గ్రామ పంచాయతీల పరిధిలో వందల ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. కొమరారం ప్రాంతంలో వారం రోజులుగా వరదనీటిలో మునిగిపోయిన వరి మురిగిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాలలో వరద ప్రభావంతో నీటమునిగిన పంటలను సందర్శించిన వ్యవసాయ శాఖ అధికారులు వరి ఇంకా నీటిలో మునిగి ఉందని, పూర్తిగా తేలితే పంట పరిస్థితిని అంచనా వేసి నష్టం లెక్కకడుతామని ఏఓ సతీష్ తెలిపారు.

ఐదెకరాల్లో పంట పోయింది..



ఈ ఏడాది 25 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాం. తుఫాన్‌తో తుమ్మల వాగు పరివాహకంలోని ఐదెకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నది. రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు కౌలుతోపాటు రూ.15 లక్షలు పెట్టుబడి అయింది. అధికారులు సర్వే చేసి ఆదుకోవాలి. లేదంటే అప్పుల ఊబిలో కూరుకపోవడమే.

– బానోత్ సేవ్యా, రైతు, జేత్యాతండా

నష్టం అంచనా వేయాలి...



పంట నష్టంపై అంచనా వేసి, పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తే వరద ఉధృతికి మొత్తం కొట్టుకపోవడంతోపాటు, ఇసుక మేట పెట్టింది. దీంతో సుమారు రూ 1.40 లక్షలు నష్టం ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పంటను బట్టి పరిహారం అందించాలి.

– మూడు లచ్చి, మాచినేనిపేటతండా

పత్తి మొక్కలు కొట్టుకుపోయాయి..



మూడెకరాల్లోని పత్తి మొక్కలు కొట్టుకుపోయాయి. ఆరుఎకరాలు రూ.1.20 లక్షలకు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాం. మరో నెలరోజుల్లో పత్తి పంట చేతికి వస్తుందని ఆశపడితే వాగు ఉప్పొంగింది. రూ.3.50 లక్షలు నష్టం ఏర్పడింది. కౌలు, పెట్టుబడికి చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– లకావత్ శాంతి, రైతు మాచినేనిపేటండా

రైతులను ఆదుకోవాలి..



భారీ వర్షాలతో పత్తి, మొక్కజొన్న పంట పూర్తిగా నేలవాలింది. చేలల్లోకి వరదతోపాటు ఇసుక కూడా భారీగా చేరడంతో నష్టం అధికంగా ఉండే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ అధికారులు తక్షణం నష్టం అంచనా కోసం సమగ్రంగా సర్వే చేయాలి. వెంటనే స్పందించి రైతులు ఆదుకునేలా నివేదికలు ఉండాలి.

– సందిరి రమేష్, మొండితోగు, ఇల్లెందు

పార్లమెంట్‌లో ఎంపీ ప్రసంగంపై హర్షం

పాల్వంచ: కేటీపీఎస్ పాత ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ చొరవ తీసుకోవాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడటం పట్ల టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర నాయకుడు చారుగుండ్ల రమేష్, సందుపట్ల శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేఖరులతో మాట్లాడారు. ఖాళీగా ఉన్న 500 ఎకరాల భూమి, బొగ్గు నిల్వలు, కిన్నెరసాని నీరు, రైల్వేలైన్లు, సబ్ స్టేషన్లు ఉన్నాయని, మరో ప్లాంట్‌కు అనువైనది కోరడం ఈ ప్రాంతం అభివృద్ధికి శుభసూచకం అన్నారు.

22న ఉపాధి పనుల జాతర ప్రారంభం

జూలూరుపాడు: ఈనెల 22న ఉపాధి పనుల జాతర కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ తాళ్లూరి రవి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా పడమటనర్సాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పశువుల కొట్టం, అజోల్లా పశువుల పోషకాహారం ఉత్పత్తి కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గుండ్లరేవు, కొత్తూరు,సురారం గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలను, రామచంద్రాపురం, సురారం, వినోభానగర్ గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం

పాల్వంచ: హీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా పాల్వంచ మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఖాసీం ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, ఎస్‌ఐలు జీవన్ రెడ్డి, కల్యాణి, సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ఎంఓ సోమరాజు దొర ప్రారంభించారు. పలువురు రక్తదానం చేశారు.

ప్రకృతి ప్రమాదాలను ఎదుర్కోవాలి



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య


టేకులపల్లి: పశువుల సంతలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, అధికారులు

ఇల్లెందు: ప్రకృతి ప్రమాదాలను ఎదుర్కొనేందుకు టీం వర్క్ చేయాలని, వార్డు ఆఫీసర్లు మున్సిపల్ అధికారులు స్థానికంగా ఉండాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ వార్డు ఆఫీసర్ స్థానికంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రతీ ఇంటికి వెళ్లి సమస్యలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. వార్డు ఆఫీసర్లు కేవలం ఇందిరమ్మ ఇళ్లకే పరిమితం కాకుండా వార్డులో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందించాలన్నారు.

ఏ వార్డులో మంచినీటి సమస్య ఉందో, వీధి లైట్లు, డ్రైయినేజీ లేని వార్డులు, రోడ్లు లేని వార్డులు, కోతులు, కుక్కలు బెడద, పిచ్చి మొక్కలు పెరగటం, బ్లీచింగ్, ఫాగింగ్ చేయించటం, గడ్డిమందు కొట్టించటం పనులు వేగంగా సాగాలన్నారు. ఇందుకోసం బడ్జెట్ కేటాయింపులు చేసుకోవాలని సూచించారు. ప్రతీరోజు వార్డు ఆఫీసర్ వార్డులో తిరిగి తమ వార్డులో ప్రజా సమస్యలను నోట్ చేసుకుని కమిషనర్ దృష్టికి తీసుకరావాలని, జఠిలమైన సమస్యలు ఉంటే కమిషనర్ వచ్చి తన దృష్టికి తీసుకొస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పట్టణ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ అధికారులతో సమావేశమై నీటి విడుదలలో జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. పట్టణానికి బుగ్గవాగు పెద్ద సమస్యగా మారిందని, అటు సత్యనారాయణపురం, ఇటు నంబర్ –2 బస్తీ, స్టేషన్ బస్తీలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. వాగు పొంగితే ప్రజలకు ఇబ్బందులు లేకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, లోలెవల్ కాజ్‌వేల వద్ద చెత్త అడ్డుతగలకుండా ఎప్పటికప్పుడు క్లీన్ అండ్ గ్రీన్ పాటించాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ శ్రీకాంత్, డీఈ మురళీ, మేనేజర్ అంకుషావలీ, మున్సిపల్ యంత్రాంగం, వార్డు ఆఫీసర్లు స్థానిక నాయకులు ఉన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

టేకులపల్లి: వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. టేకులపల్లి రైతువేదికలో బుధవారం అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య లోపం ఏర్పడకుండా పర్యవేక్షిస్తూనే దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. అలాగే, విద్యుత్ సంబంధిత ప్రమాదాలు, దోమలతో వ్యాధుల వ్యాప్తి జరగకుండా చూడాలని సూచించారు. తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం, ఎంపీడీఓ బైరు మల్లీశ్వరి, ఎంపీఓ జేఎల్.గణేష్ గాంధీ, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు లక్కినేని సురేందర్‌రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోలియాతండాలోని పశువుల సంత స్థలంలో వనమహోత్సవంలో భాగంగా అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే కనకయ్య మొక్కలు నాటారు. ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్‌నాయక్, కోరం సురేందర్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లండి..

ఇల్లెందు: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, ఎస్ఎంహెచ్ హాస్టళ్లలో పనిచేసే అవుట్ సోర్సింగ్ కార్మికులకు పది నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణం వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యను బాధితులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. జీఓ 60 ప్రకారం రూ.15,600 వేతనం ఇవ్వాలని, వేతనంతో కూడిన సెలవులు ఇప్పించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. జయ, కవిత, విజయ, సరోజ, వర్ష, సుధ పాల్గొన్నారు.

తండాను సందర్శించిన తహసీల్దార్

జూలూరుపాడు: భోజ్యాతండా గ్రామ పంచాయతీ వెనకతండా గ్రామాన్ని బుధవారం తహసీల్దార్ టి.శ్రీనివాస్ సందర్శించారు. గ్రామంలో భారీవర్షాలకు కూలిపోయిన పూరిగుడిసెను ఆయన పరిశీలించారు. బాధిత కుటుంబం ధరావత్ జగ్గు, ధర్మి దంపతులను తహసీల్దార్ శ్రీనివాస్ పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెక్రటరీ వెంకట్, కాంగ్రెస్ నాయకుడు వాంకుడోత్ కిషన్ ఉన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్సై రమణారెడ్డి

కొత్తగూడెంఅర్బన్: గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పర్మిషన్ తీసుకోవాలని లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి సూచించారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ విగ్రహం ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యుత్ శాఖ అనుమతితో మండపాల నిర్వాహకుల ఫోన్ నంబర్లతో ఫ్లెక్సీ ఏర్పాటు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్‌లను వినియోగించాలన్నారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవడం వలన ప్రతీరోజు పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకం చేస్తారని చెప్పారు.

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు

ఇల్లెందు: పట్టణంలోని 9వ వార్డు కాకతీయనగర్‌లో వినాయక మండపాల ఏర్పాటుకు ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పడిదల నవీన్, స్వరూప, సాహితీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంసీ నాగిరెడ్డి, ఇమామ్, సైదులు, కోటమ్మ, ఇందు, శ్రీకాంత్, రవి, శివ తదితరులు పాల్గొన్నారు. హాస్పిటల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వెంకటేష్, నాగేశ్వరరావు, రేల్ల నాగలక్ష్మి, విశ్వనాథం, సాయి పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న నిర్వాహకులు

కాలేజీలో మరమ్మతులు చేపట్టండి..

టేకులపల్లి: టేకులపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు బి.వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద నిరసన తెలియజేశారు.

కాలేజీలో మరమ్మతులు చేపట్టాలని, రోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు. మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బిల్డింగ్‌లోని అన్ని గదులకు విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గ్రౌండ్‌లో వాననీరు నిల్వ ఉండకుండా చేయాలన్నారు. వాష్ రూమ్ సదుపాయం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రామ్‌చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, నాయకులు

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు 31 చివరి తేదీ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 31 చివరి తేదీ అని, ఆసక్తిగల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దూరవిద్య వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ బడి మధ్యలో మానేసిన వారు, పదో తరగతి ఫెయిల్ అయి 14 సంవత్సరాలు నిండినవారు పదో తరగతి చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. 15 సంవత్సరాలు నిండి పదో తరగతి పూర్తి చేసిన వారు, ఇంటర్ మధ్యలో ఆపినవారు, ఫెయిల్ అయినవారు ఇంటర్‌లో చేరవచ్చని తెలిపారు. సెలవురోజుల్లో మాత్రమే తరగతులు ఉంటాయని చెప్పారు. వివరాలకు 9704024681, 9908686028 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని డీసీసీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమిదాన్ బచావో సభ్యులు, టీపీసీసీ సభ్యులు, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ.శౌరి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. 40 ఏళ్ల వయస్సులోనే రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి టెక్నాలజీకి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. టెలి కమ్యూనికేషన్స్, వాణిజ్య, రక్షణ, విమానయాన సంస్కరణలు ప్రవేశపెట్టారని, విద్యావకాశాల సమానత్వం కోసం నేషనల్ పాలసీ ఫర్ ఎడ్యుకేషన్‌ను తీసుకొచ్చారని తెలిపారు. గౌస్ మొనుద్దీన్, మోతుకూరి ధర్మారావు, తంగెళ్ల లక్ష్మణ్, కసనబోయిన భద్రం, బానోత్ ఈశ్వర్ సింగ్, వీరాపురం రామ్‌లక్ష్మణ్, అజ్మీరా సురేష్ నాయక్, కరీం పాషా, జయప్రకాష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పాల్వంచ: రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌లో గాంధీ విగ్రహానికి పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, ఎస్ఏ.జలీల్, కొండం వెంకన్న, మహేష్, మహిపతి రామలింగం, కాల్వ భాస్కర్‌రావు, భువన సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎడవల్లి కృష్ణ, బాలునాయక్, చింతా నాగరాజు, రాము నాయక్ పాల్గొన్నారు.


కొత్తగూడెంఅర్బన్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

జూలూరుపాడు: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జయంతిని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి దుద్దుకూరి మధుసూదన్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ ఆశయ సాధన కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి రాజీవ్‌గాంధీ ఎంతో కృషి చేశారని, ఐటీ రంగానికి పునాదులు వేసిన మహనీయుడని కొనియాడారు. వేల్పుల నరసింహారావు, నున్నా రంగారావు, రాంశెట్టి రాంబాబు, మాచినేని సత్యనారాయణ, రాంశెట్టి నాగేశ్వరరావు, కొండెం జోగారావు, తాళ్లూరి అచ్చయ్య, పురస్తపురపు శ్రీను, చంద్రా వెంకటేశ్వరరావు, మద్దిన్ని శేషగిరిరావు, లకావత్ రమేష్, జానివియా, మందా రాజేష్, కోటేశ్వరావు పాల్గొన్నారు.


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఇల్లెందు: స్వర్గీయ రాజీవ్‌గాంధీ 81వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి, జేకే బస్టాప్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదాంబా సెంటర్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు రాజీవ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దొడ్డా డానియేల్, పులి సైదులు, సుదర్శన్ కోరి, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోరం సురేందర్, భూక్యా దేవా, కోరం ఉమ, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్, ఈది గణేష్, సర్దార్, మధురెడ్డి, సంజయ్, రవి, ధర్మ లక్ష్మయ్య, రామారావు, హనుమంతు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచ: నివాళులర్పిస్తున్న నాయకులు


జూలూరుపాడులో కాంగ్రెస్ నాయకులు


టేకులపల్లి మండల కేంద్రంలో..